వ్యాధులతో పశువులు జాగ్రత్త

- తొలకరిలో వ్యాధులు సోకే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- పశువైద్యాధికారి విజయ్‌కృష్ణ



కర్రబల్లవోలులో గొర్రెలకు వ్యాక్సిన వేస్తున్న వైద్యాధికారి



ఆవులు



పశువైద్యాదికారి విజయ్‌కృష్ణ

ఓజిలి: ఈ ఏడాది ముందుగానే వర్షా కాలం ప్రారంభమైంది. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, లేకుంటే వ్యాధుల బారిన పడి మృతిచెందే అవకాశం ఉందని పశు వైద్యులు విజయ్‌కృష్ణ తెలిపారు. మూగజీవాలకు వ్యాధి సోకిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. మూగజీవాలు పరిస్థితి విషమంగా ఉంటే 1962 నంబర్‌కు కాల్ చేస్తే వైద్యులు ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తారని వివరించారు. వర్షాకాలంలో గొంతువాపు, నీలి నాలుక, గాలికుంటు (ఫుట్ అండ్ మౌత్), చిటుకు వ్యాధి, దొమ్మరోగం, నిమోనియా(గుండె జబ్బు), అమ్మతల్లి, పరాన్న జీవులు బెడద (నట్టలు), జలగ వ్యాధులు ఎక్కువగా సోకుతాయని తెలిపారు. వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

గొంతువాపు ప్రాణాంతకం

పాశ్చురెల్లా జాతి సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు ప్రాణంతకమైనది. కళ్లు, ముక్కు, నోటి నుంచి నీరు కారుతుంది. ఇది ఎక్కువగా జూన్, అక్టోబర్ నెలల్లో సోకుతుంది. గొంతు, చాతి, తల భాగాల్లో నీరుచేరడం వల్ల వాపు వస్తుంది. ఆరు నెలలు పైబడిన జీవాల్లో గొంతువాపు, జబ్బవాపు నివారణకు మిశ్రమ టీకా 5 మిల్లీ లీటర్ల చొప్పున వేయాలి.

మండలం	గొర్రెలు	గేదెలు
సూళ్లూరుపేట	3745	8344
తడ	3452	5875
దొరవారిసత్రం	4610	9156
నాయుడుపేట	2661	9449
పెళ్లకూరు	3973	8457
ఓజిలి	3154	15634

రైస్ వ్యాధి

రైస్ వ్యాధి క్యూలికాయిడస్ దోమ వల్ల వస్తుంది. ఎక్కువగా సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో వ్యాపిస్తుంది. దీని నివారణకు టీకా మందులు లేవు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ వ్యాధి సోకినప్పుడు నాలుక నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడతాయి. మడమ చుట్టూ వాపు వస్తుంది. దీని నివారణలో భాగంగా వేపాకుతో పొగబెట్టి దోమలను నివారించాలి. జబ్బు చేసిన జీవాలను వేరుచేసి కిలో బరువుకు 5–10 మిల్లీగ్రాముల ఆక్సిటెట్రాసైక్లిన్ కలిపి ఇవ్వాలి. నోటి పుండ్లను ఒక్క శాతం పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రపరిచి బోరోగ్లిజరిన్ పూయాలి. పుండ్లతో జీవాలు మేతను తినలేవు కాబట్టి రాగి లేదా జొన్న జావను తాగించాలి. ఐఐఎం రక్షాబ్లూ టీకాలను ఒక్కో జీవానికి 2 మిల్లీలీటర్లను చర్మం కింద ఇవ్వాలి.

గాలికుంటు(ఫుట్ అండ్ మౌత్) వ్యాధి

గాలికుంటు వ్యాధి వైరస్ కారణంగా వ్యాపిస్తుంది. స్పర్శ, గాలి వ్యాధిగ్రస్థ జీవం లాలాజలం ద్వారా ఇది ఇతర జీవాలకు సోకుతుంది. గాలికుంటు వ్యాధి ఆవులు, గేదెలు, ఎద్దులకు ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. నాలుక, మూతి, కాలిగిట్టలు మధ్య పొక్కులు, బొబ్బలు ఏర్పడతాయి. గిట్టలు, నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేట్, బోరిక్ యాసిడ్ ద్రావణంతో శుభ్రపరిచాలి. నోటిలో పుండ్లకు గ్లిజరిన్ పూయాలి. గంజిని ఎక్కువగా తాగించాలి. గాలికుంటు వ్యాధి టీకాను 5 మిల్లీలీటర్లను ఆరు నెలలకు ఒకసారి చర్మం కింద వేయాలి.

చిటుకు వ్యాధి

తొలకరి చినుకులు పడిన తర్వాత పెరిగిన గడ్డిని తినడం వల్ల చిటుకు వ్యాధి వస్తుంది. జూన్, జూలైలో క్లాస్ట్రీడియం జాతి బ్యాక్టీరియా వల్ల వస్తుంది. వ్యాధి లక్షణాలు కనిపించకుండానే గొర్రెలు గిలగిలా కొట్టుకుని గాలిలోకి ఎగిరి కిందపడి మృతి చెందుతాయి. వైద్యుల సలహా మేరకు ఆక్సిట్రాసైక్లిన్ మందును 5–10 మి గ్రాములను కిలో బరువుకు లెక్కగట్టి ఇవ్వాలి. ప్రతి ఏటా మే, జూన్ మొదటి వారంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

అంత్రాక్స్(దొమ్మరోగం)

ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం కారణంగా విష పదార్థం వృద్ధి చెందుతుంది. తీవ్రమైన జ్వరం, తూలిపడడం, కాళ్లు పడిపోయినట్టు ఉండి మృతి చెందుతుంది. బాసిల్లస్ సూక్ష్మక్రిములు భూమి లోపల ఉండి వర్షా కాలం జీవాలకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో చనిపోయిన జీవాలను కోయరాదు. లోతైన గుంతలో సున్నం వేసి పూడ్చిపెట్టాలి.

నిమోనియా(గుండె జబ్బు)

ఇది వైరస్ ఇతర సూక్ష్మ క్రిముల ద్వారా వ్యాపిస్తుంది. చలి, వర్షాకాలంలో ఎక్కువగా వస్తుంది. జ్వరం, దగ్గు, ముక్కు నుంచి చీమిడి, నీరు కారుతుంది. కిలో బరువుకు 4–5 మిల్లీ గ్రాముల స్ట్రెప్టోపెన్సిలిన్ లేదా జంటా మైసిన్ టీకాలు వేయాలి.

క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కోట: స్థానిక తూర్పువీధిలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోపూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కోలాటాలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారి పల్లకీ ఉత్సవం చేపట్టారు.

చెరువు అలుగునూ వదలని అక్రమార్కులు



చెరువును ఆక్రమించి చదును చేస్తున్న అక్రమార్కులు

కలువాయి(సైదాపురం): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక, గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు పోరంబోకు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. కలువాయి మండలంలోని కుల్లూరు ఎర్ర చెరువు అలుగు ప్రాంతాన్ని కొందరు పచ్చనేతలు దర్జాగా కబ్జా చేశారు. ఆదివారం సెలవు కావడంతో జేసీబీలతో చెట్లను తొలగించి చదును చేశారు. ఈ చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. అలుగు భూమిని కబ్జా చేసి చదును చేయడం వల్ల చెరువులోకి నీరు చేరదని, అంతేగాక కుల్లూరు చాకిరేవుకు నీరు పారదని రైతులు వాపోతున్నారు. దీన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మెస్సర్స్ దమ్ము బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పరిశ్రమ జీఎం దమ్ము కిశోర్‌బాబు భూ మి పూజ చేశారు. ఈ పరిశ్రమను 22.49 ఎకరాల్లో చేపడుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కట్టా సుధాకర్‌రెడ్డి, నాయకులు సంచి కృష్ణయ్య, కాటంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, అక్రపల్లి మాధవరెడ్డి, ప్రసాద్‌నాయుడు, మదన్‌నాయుడు, సిద్దలనాయుడు, పెంచలయ్య, చంద్ర, రవి, పీఆర్వో గ్రేస్‌రాజా, నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం

చిల్లకూరు : యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని యోగా శిక్షకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం సుమారు 100 మందికి యోగా శిక్షణ ఇచ్చారు. వారితో ఆయన యోగాసనాలు వేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణవాయువును ఎలా అందించవచ్చనే దానిపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ వార్డుల్లో యోగా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన దంపతులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జాతీయ రహదారి కూడలి రింగ్ రోడ్డు వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన రాజశేఖర్, భవాని బైక్‌లో ఆదివారం శ్రీకాళహస్తి వెళ్లి స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నాయుడుపేట సమీపంలో జాతీయ రహదారి రింగ్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను బైక్ ఢీకొంది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అటుగా వెళుతున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థు దంపతులు పోలీసు వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు గూడూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సమ్మేళనం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ తెలుగు సాయిభక్త సమ్మేళనం ఆదివారం రాత్రి ముగిసింది. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన సాయిభక్త ఉపన్యాస గురువులు పలు అంశాలను బోధించారు. మధ్యాహ్నం అన్నదానం, తత్సంగం, రాత్రి సాయి పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమంలో జాతీయ తెలుగు సాయి భక్త సమ్మేళనం సేవా ట్రస్టు చైర్మన్ ఎస్‌ఎల్ నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ లక్ష్మీ, తిరుపతి జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మీ, ప్రియ, కర్లపూడి కృష్ణయ్య, అల్లం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు



చిల్లకూరు : కోట మండలం గూడలి ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో ధ్వంసమైన స్వర్ణముఖి నది కరకట్ట



చిల్లకూరు : కోట మండలం విద్యానగర్ ప్రాంతంలో భారీగా ఉన్న ఇసుక నిల్వలు

చిల్లకూరు : అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లో యథేచ్ఛ గా ఇసుక తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. గతంలో చిట్టమూరు, వాకాడు మండలాల్లో ఏర్పాటుచేసిన రీచ్‌ల వద్ద తవ్వకాలు నిలిపివేసి కోట మండలంలోని గూడలి, దొరువుకట్ట ప్రాంతాల్లో తవ్వకా లు చేపడుతున్నారు. వీరు స్వర్ణముఖి నది కరకట్టలను ధ్వంసం చేసి నదిలోకి వాహనాలు వెళ్లేలా రోడ్లు వేసుకున్నారు. జేసీబీలతో పెద్ద ఎత్తున ఇసుక తవ్వి విక్రయాలు సాగిస్తున్నారు. గూడలి వద్ద అధికార టీడీపీకి చెందిన పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ కనుసన్నల్లో తవ్వకాలు, విక్రయాలు జరుగుతున్నాయి. దొరువుకట్ట ప్రాంతంలో ఎమ్మె ల్యే పాశం సునీల్ కుమార్ అనుచరుడు దశరథరామిరెడ్డి కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అధికారం చేపట్టిన తొలినాళ్లలో ఇసుక తవ్వకాలు, విక్రయాలను వారికి అప్పగించారు. దశరథరామిరెడ్డి ఎన్నికలకు ముందు ఉన్న ఇసుక నిల్వలను విక్రయించి సుమారు రూ.కోటికి పైగా వెనకేసుకున్నారు. దీంతో కొండేపాటి గంగాప్రసాద్, దశరథరామిరెడ్డి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు దశరథరామిరెడ్డి ప్రకటించడంతో ఎమ్మెల్యే అతని వద్దకు వెళ్లి బుజ్జగించారు. ఇసుక విషయం లీక్ కాకుండా చూసుకోవాలని చెప్పి మళ్లీ పార్టీలో కొనసాగేలా చేశారు. నాటి నుంచి దశరథరామిరెడ్డి కనుసన్నల్లోనే ఇసుక వ్యాపారం జరుగుతోంది. గంగాప్రసాద్‌కు చెందిన వ్యాపారస్తులు విద్యానగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా భారీగా ఇసుక నిల్వ చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, గనుల శాఖాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

28న సూళ్లూరుపేటలో జగన్నాథ రథయాత్ర



మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

సూళ్లూరుపేట : ఒడిశా రాష్ట్రం పూరీ పుణ్యక్షేత్రం నుంచి జగన్నాథ రథయాత్ర ఈ నెల 28న సూళ్లూరుపేట చేరుకుంటోందని నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షుడు శుకదేవస్వామి తెలిపారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన ఆదివారం ఇస్కాన్ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే జగన్నాథ రథయాత్ర మూడోసారి సూళ్లూరుపేట పట్టణానికి వస్తోందని తెలిపారు. రథయాత్ర 28వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు షార్ బస్టాండ్ నుంచి బయలుదేరి పరమేశ్వరి నగర్, బాపూజీవీధి, ఎస్‌వీటీ వీధి, పార్క్‌వీధి, కచేరివీధి, జీఎస్‌టీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, హనుమాన్ వీధి, పీఎస్‌ఆర్ వీధి, కాపువీధి, ఇస్కాన్ టెంపుల్ మీదుగా సాగుతుందని తెలిపారు. ముగింపు కార్యక్రమాన్ని శ్రీ చెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీ నగర్‌కాలనీలో నిర్వహించనున్నట్టు వివరించారు. రాత్రి 7 గంటలకు స్టేజీ ప్రోగ్రామ్, ఇస్కాన్ ప్రముఖుల సందేశాలు, జగన్నాథ్–బలదేవ్–సుభద్ర దర్శనం, 56 వంటకాలతో ఛప్పన్ భోగ్ నివేదన, హారతి కీర్తన, దీప హారతులు వుంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రథయాత్ర కమిటీ సభ్యులు డీవీఎస్ గిరి, నెల్లూరు ఇస్కాన్ మేనేజర్ రాజశేఖర్‌దాస్, సూళ్లూరుపేట ఇన్‌చార్జి డి.వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఏడుగురు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు వెంకటగిరి మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆదివారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఓ.సుకుమార్, తన్మయి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన ఎస్.శ్రీవిద్య, శరణ్య, లావణ్య, ఎంపీయూపీ బంగారుపేట బీసీ కాలనీ పాఠశాలకు చెందిన ఈశ్వరప్రసాద్, ధనుష్‌రాజ్ ఎంపికయ్యారని తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందని తెలిపారు.

పెనుశిల లక్ష్మీనృసింహునికి చందనాలంకరణ



గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం చందనాలంకరణ చేశారు. ఆదివారం స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలమూర్తికి చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

లూథరన్ చర్చిలో నిర్ధారణ కార్యక్రమం



యువతీయువకులతో మాజీ బిషప్, సంఘు కాపరి

వాకాడు : వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో ఆదివారం పెంతుకొస్తు పండుగను పురస్కరించుకుని నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన వేసవి బైబిల్ శిక్షణలో 24 మంది యువతీ యువకులను ఎంపిక చేసి బాప్టిజం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఏఎల్‌సీ మాజీ బిషప్ రైట్ రెవరెండ్ కలపాటి ఏసు ప్రసాద్ దైవ సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదలను ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘు కాపరి రెవరెండ్ ప్రశాంత్‌బాబు, పీసీ కమిటీ సభ్యులు బి.డానియల్ చంద్రబాబు, జాలాది కిషోర్, బి.రాజ్‌కుమార్, ఎస్.సాల్మన్, వైఎం సుమంత్, వేముల దినకర్‌బాబు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

దక్కిలి : రైతులు పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి కేవీకే శాస్త్రవేత్త బి.విజయశ్రీ తెలిపారు. మండలంలోని వడ్ల మోపూరులో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఎరువుల వినియోగం, సాగు ఖర్చు తగ్గించి సుస్థిర ఆదాయం పొందడం తదితర అంశాలను వివరించారు. హైదరాబాద్ భారతీయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బండెప్ప భూసార పరీక్షలు, రైతు స్థాయిలో ఎలా పరీక్షించుకోవాలో అవగాహన కల్పించారు. నిమ్మలో పూత నియంత్రణ, పెరటి కోళ్ల పెంపకంపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయశాఖ ఉద్యాన అధికారులతో కలిసి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నాగార్జునరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కండలేరులో 38.687 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 38.687 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,360, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బలవంతంగా వీవోఏ రాజీనామా

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం పెరమకొండ వీవోఏగా పనిచేస్తున్న రజినితో ఆదివారం కూటమి నాయకులు, వెలుగు ఏపీఎం, సీసీలు బలవంతంగా రాజీనామా చేయించారు. కూటమి ప్రభు త్వం ఏర్పడినప్పటి నుంచి చిరుద్యోగులపై వేధింపులకు దిగుతున్నారు. వారితో రాజీనామా చేయించడం, లేదా విధుల నుంచి తొలగించడం వంటి చర్యలకు దిగుతున్నారు. అనంతరం తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే కలువాయి మండలం తోపుగుంట, బ్రాహ్మణపల్లి, మాదన్నగారిపల్లి, దాచూరు గ్రామాలకు చెందిన వీవోఏలను విధులకు అనుమతించలేదు. వారు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. వెలుగు అధికారులు మాత్రం వారిని విధులకు హాజరుకాకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. వారి పై కోర్టు ధిక్కరణ కేసు నడుస్తున్నట్లు బాధితులు తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు





అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. సంతానం కోసం రావిచెట్టు, త్రిశూలం వద్ద ఒరపడ్డారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో క్యూలైన్లలోని భక్తులకు దాహార్తిని తీర్చేందుకు ఆలయ సిబ్బంది వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు శివకుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మల్లాంలో ప్రత్యేక పూజలు



చిట్టమూరులో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం

చిట్టమూరు : మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుపండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కుజదోషం ఉన్న వారు హోమాలు చేయించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అరవపాళెం గ్రామానికి చెందిన మోడిపోయిన కావ్య, నెల్లూరు వాసులు ఉభయదారులుగా వ్యవహరించారు.

రేపు మెగా జాబ్ మేళా

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఇందులో శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17కు పైగా బహుళ జాతీయ పరిశ్రమల్లో 900లకు పైగా ఉద్యోగాల భర్తీ కోసం ఆయా సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని వెల్లడించారు. ముందుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99850 56929, 91544 49677, 99888 53335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఏవో గల్లా కృష్ణ తెలిపారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు : క్యాన్సర్ బారిన పడి వైద్యం చేయించుకోలేని మహిళకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రూ.25 వేలు సాయంచేశారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన బీబీజాన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇటీవల శస్త్ర చికిత్స చేశారు. గాయం మానలేదు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి స్థోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. కుటుంబ సభ్యులు ట్రస్టు ప్రతినిధులను ఆశ్రయించి ఆమె పరిస్థితిని వివరించారు. దీంతో చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు స్పందించి తమ ప్రతినిధుల ద్వారా రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో రాజనేని వెంకటేశ్వర్లు నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు



పోలీసుల అదుపులో వున్న పేకాటరాయుళ్లు

పెళ్లకూరు : మండలంలోని ఎర్రగుంట గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్‌ఐ నాగరాజు దాడి చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆదివారం దాడి చేసినట్టు తెలిపారు. ఈ దాడులో ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని మూడు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు, రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షైనింగ్ స్టార్స్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దగ్గవోలు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సునంద

దక్కిలి : ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్‌కు మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన దగ్గవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు యగ్నప్రియ, దోర్నాదుల నందిని, డక్కిలి హైస్కూల్ విద్యార్థులు కోలా అలేఖ్య, సింధుజోష్, తీర్థంపాడు హైస్కూల్ విద్యార్థి శ్రీనాథ్, డక్కిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కీర్తన షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్టు తెలిపారు. వారికి సోమవారం తిరుపతి మహతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డు అందజేస్తారని తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.